అంగన్వాడీ కేంద్రాల్లో ప్రిన్సిపల్ సెక్రటరీ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పీలేరు/కలకడ

రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.సూర్య కుమారి అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం ఆమె పీలేరు పట్టణం, ఎల్ల మంద క్రాస్‌లోని అంగన్వాడీ కేంద్రం, కలకడ మండలంలోని బాటవారిపల్లె అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు, మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా, పౌష్టికాహార పథకం సక్రమంగా అమలవుతుందా లేదా అని ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులను ఆప్యాయంగా పలకరించి వారి అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి వెంట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమాదేవి, పీలేరు, కలకడ ఎంపిడిఒలు శివశంకర్, అబ్దుల్ రహీం, డిపిఒ మస్తాన్‌వలి, కలకడ డిఎల్‌పిఒ నాగరాజా, సిడిపిఒ రాజమ్మ, సూపర్వైజర్లు స్వరూప, అక్కయ్యమ్మ, మహిళా పోలీస్ గీత, అంగన్వాడీ కార్యకర్తలు ఇందిర పాల్గొన్నారు.

పీలేరు : అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూర్యకుమారి

జీపుజాతా ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న గేయానంద్

కడప 'ఉక్కు' కోసం పోరాటాలు

- పరిశ్రమ ఏర్పాటుపై ప్రభుత్వాలు విఫలం
- విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలి
- జమ్మలమడుగు నుంచి ప్రారంభమైన జీపుజాతాలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

జీపుజాతా ప్రారంభ కార్యక్రమానికి హాజరైన ప్రజలు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్/పెద్దముడియం

కడప ఉక్కు కర్మాగారం కోసం చేసే పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, పరిశ్రమ ఏర్పాటు చేసే వరకూ పోరాటాలను కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు నెల్లూరులో జరుగుతున్న నేపథ్యంలో పార్టీ ఆధ్వర్యాన కడప ఉక్కు ఆంధ్రుల హక్కు పేరుతో గురువారం కడప జిల్లా జమ్మలమడుగు నుంచి తలపెట్టిన రాష్ట్ర జాతాను ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. జమ్మలమడుగు పాత బస్టాండ్‌లో ముందుగా మాజీ ఎంపీ ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. జీపుజాతా జమ్మలమడుగులో ప్రారంభమై ముద్దనూరు, పులివెందుల, వేంపల్లె, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల, కమలాపురం మీదుగా రాత్రికి కడప నగరానికి చేరుకుంది. జాతాకు ఆయా ప్రాంతాల్లో ప్రజలు, నాయకులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ కడప ఉక్కు రాయలసీమ హక్కు అనే సంకల్పాన్ని పాలకులు రాజకీయ పార్టీలు మరిచిపోయాయన్నారు. ఎప్పటికైనా ఉద్యమించి ఉక్కును సాధించుకొని తీరుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. కడప ఉక్కు కోసం పెద్ద ఎత్తున ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. బిజెపి ప్రభుత్వ సహకారంతో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఇరుక్కుపోయి రాష్ట్ర ప్రయోజనాలను, కడప ఉక్కు పరిశ్రమను తాకట్టు పెట్టాయన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు రామన్న మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ గురించి జనసేన, టిడిపి, వైసిపి పార్టీలు కేంద్రంతో మాట్లాడకపోవడం చాలా బాధాకరమన్నారు. బిజెపి ప్రభుత్వం నిసిగ్గుగా కడప ఉక్కు పరిశ్రమపై ఊసెత్తకుండా ఉండడం ఆంధ్రప్రదేశ్, జిల్లా ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ కడపలో బ్రాహ్మణికి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం సాధ్యమైనప్పుడు సెయిల్‌కు ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. పరిశ్రమ సాధన కోసం జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాజీనామా పోరాడాలన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్, జి.శివకుమార్, వి.అన్వేష్, సిపిఎం జమ్మలమడుగు పట్టణ కార్యదర్శి ఏసుదాసు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఉక్కు పరిశ్రమ ప్రాముఖ్యత గురించి ప్రసంగించారు. అనంతరం ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన వద్దకు చేరుకొని శిలాఫలకాలను పరిశీలించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వినయ్, విజయ్, మహేష్, సురేంద్రరెడ్డి, ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వి.శివ నారాయణ, రమణ, సురేష్, భైరవ ప్రసాద్, రఘు, రాజామణి, దస్తగిరిరెడ్డి, నరేంద్ర కుమార్, మధు, హరిబాబు, ఖాదర్, చంద్ర, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముద్దనూరు : కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ డిమాండ్ చేశారు. జీపుజాతా సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ విభజన చట్టం హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక ప్యాకేజి కింద రూ.50 వేల కోట్లు రాష్ట్రానికి రావాల్సి ఉందన్నారు. రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పరిశ్రమలు వస్తే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్రాభివద్ధి జరుగుతుందన్నారు.

పులివెందుల టౌన్ : కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అని సిపిఎం రాష్ట్ర నాయకులు రామన్న అన్నారు. పట్టణంలో పూల అంగళ్ల సర్కిల్‌లో రామన్న, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చాంద్ బాషా మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ జిల్లాల్లోని ఒక్కటైన కడప జిల్లాలో భారీ ఉక్కు పరిశ్రమ నిర్మించడానికి పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని పాలకులు ఉక్కు ఫ్యాక్టరీని కడప జిల్లాలో ఏర్పాటు చేయడానికి నిరాకరించడం దారుణమని పేర్కొన్నారు.

వేంపల్లె : కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను తీర్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. నాలుగు రోడ్ల కూడలిలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ పీఠం కదిలేందుకు సిపిఎం చేసే పోరాటాల్లో పాలు పంచుకోవాలని కోరారు. సిపిఎం నాయకులు బైరవ ప్రసాద్ మాట్లాడుతూ కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేస్తే దాదాపు లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశాలు ఉంటాయాని చెప్పారు.

ఎర్రగుంట్ల : జిల్లాలో ఉక్కు పరిశ్రమ శిలాఫలకాలికే పరిమితమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సిపిఎం సీనియర్ నాయకులు వి.పి.బయన్న అన్నారు. నాలుగు రోడ్ల కూడలిలో వారు మాట్లాడుతూ 2014లో కాంగ్రెస్ అధికారంలో ఉండగా ప్రతిపక్ష బిజెపి మద్దతుతో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమకు రాష్ట్రపతి ఆమోదం ప్రకటించడం జరిగిందన్నారు. సెయిల్ సంస్థ ఆధ్వర్యంలో భారీ ఉక్కు పరిశ్రమను నిర్మిస్తామని చెప్పి అదే సెయిల్ సంస్థ చైర్మన్ ద్వారా తప్పుడు నివేదికను ప్రకటన చేయించారన్నారు. ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరుతూ పాదయాత్రలు, సైకిల్ ర్యాలీలు, బైక్ ర్యాలీలు ఇలా అనేక రకాలుగా నిరసనలు తెలియజేస్తూ ప్రజల పక్షాన పోరాటం చేస్తోందని వివరించారు.

కడప అర్బన్ : కడప ఉక్కు ఆంధ్రుల హక్కు పేరుతో జమ్మలమడుగులో ప్రారంభమైన జీపు జాత రాత్రి కడపకు చేరుకుంది. ఐటిఐ సర్కిల్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద రాత్రి చేరుకుంది. ఆ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు రామన్న ప్రసంగించారు. కార్యక్రమంలో సిపిఎం నగర్ కార్యదర్శి రామ మోహన్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, కుమారస్వామి రెడ్డి, నాయకులు వెంకటరామయ్య, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-సంబేపల్లి (రాయచోటి)

ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి సంబేపల్లి మండలంలో సిఎం పర్యటన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీ ముఖ్యమంత్రి సంబేపల్లి మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సంబేపల్లికి వస్తున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను మంత్రి, ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏ ఒక్క చిన్న పొరపాటు జరగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. హెలిప్యాడ్, బారికేడ్లు, అగ్నిమాపక వాహనం ఏర్పాటు, భద్రతా సౌకర్యం, పార్కింగ్, ప్రోటోకాల్, సేఫ్ రూమ్ సౌకర్యం, విద్యుత్ సరఫరా, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం కల్పన తదితర అన్ని రకాల ఏర్పాట్లు సక్రమంగా చేయాలని మంత్రి ఆదేశించారు. ఎక్కడ ఎటువంటి తప్పులు దొర్లకుండా ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయం కలిగితే వెంటనే జనరేటర్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్, సేఫ్ రూమ్, చికిత్సాపరమైన మందులు ఏర్పాటు చేయడంతోపాటు అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారులు శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనను ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసి విజయవంతం చేద్దామన్నారు. పెన్షన్ల పంపిణీలో ప్రజలకు లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా పెన్షన్లు అందుకునే లబ్ధిదారులను వారి వివరాలను అధికారులు మంత్రికి, కలెక్టర్‌కు తెలియజేశారు.

సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్

సిఎం భద్రత ఏర్పాటును పరిశీలించిన ఎస్‌పి

కడప అర్బన్ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫిబ్రవరి 1న అన్నమయ్య జిల్లా పర్యటన నిమిత్తం ప్రత్యేక విమానంలో ఎయిర్ పోర్ట్‌కు రానున్న నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు ఎస్‌పి ఇ.జి.అశోక్ కుమార్ పలు సూచనలు చేశారు. ఎయిర్ పోర్ట్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎస్‌పి వెంట అదనపు ఎస్‌పి బి.రమణయ్య, కడప డిఎస్‌పి వెంకటేశ్వర్లు, ఎఆర్‌డిఎస్‌పి శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ దారెడ్డి భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి సూర్యకుమారి

సమావేశంలో మాట్లాడుతున్న సూర్యకుమారి

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి సూర్యకుమారి ఐసిడిఎస్ అధికారులు, సూపర్వైజర్లను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ శాఖలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. జిల్లాలో అంగన్వాడీ సేవలను మరింత పటిష్టవంతంగా నిర్వహించాలని చెప్పారు. కిషోర్ వికాసం కార్యక్రమానికి సంబంధించి అంగన్వాడీ, పాఠశాలలు, కాలేజీలలో సఖి గ్రూపులను, యువ గ్రూపులను ఏర్పాటు చేసి వారంలో ఒకరోజు గ్రూపులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. బాలికలు వారి సమస్యలను వారే పరిష్కరించుకునే విధంగా మహిళా సంరక్షణ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి గ్రూపుకి ఒక పీర్ గ్రూప్ లీడర్‌ని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి పథకాలను, అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా బాత్రూములు, నీళ్ల సదుపాయం, విద్యుత్తు, ఇతర సదుపాయాలు సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. వాష్ కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా అమలు పరచాలని కోరారు. కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బాల్య వివాహాలను కట్టడి చేసేందుకు జిల్లాలో పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు ప్రత్యేక అధికారికి వివరించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఐసిడిఎస్ శాఖ అధికారులు సూపర్వైజర్లకు సూచించారు. కొన్ని సమాజ పరమైన సమస్యలు ఉన్నప్పటికీ సామాజిక బాధ్యతలో ఉన్నటువంటి సర్పంచ్, గ్రామ పెద్దలు, బాల్య వివాహ నిషేధ కమిటీల ద్వారా అవగాహన కల్పిస్తూ బాల్య వివాహాల వ్యవస్థను నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో ఐసిడిఎస్ కర్నూలు రీజనల్ జాయింట్ డైరెక్టర్, జిల్లా ఐసిడిఎస్ అధికారిణి, జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి, ఐసిడిఎస్ సిడిపిఒలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

అంగన్వాడీలకు ప్రిన్సిపల్ సెక్రటరీ హామీ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అంగన్వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారానికి ప్రిన్సిపుల్ సెక్రటరీ సూర్యకుమారి హామీ ఇచ్చినట్లు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శ్రీలక్ష్మి, పి.రాజేశ్వరి కోశాధికారి పి.బంగారుపాప వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్యలక్ష్మి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రిన్సిపుల్ సెక్రటరీ సూర్యకుమారిని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఐసిడిఎస్ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో అవకతవకలు ఉన్నాయని, హెల్పర్స్‌కు ప్రమోషన్‌లు ఇవ్వలేదని వెంటనే నోటిఫికేషన్ రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు నెలలు జీతాలు రావాలని మూడు సంవత్సరాల నుండి సిబి ఈవెంట్స్ ఇవ్వలేదన్నారు. అర్బన్ ఏరియాలో పెరిగిన అద్దెలు ఇవ్వలేదన్నారు. రాయచోటిలో 7 నెలలు అద్దెలు ఇవ్వలేదని, మొబైల్స్ క్లారిటీ లేనందున నోట్ కెమెరా రద్దు చేయాలని, స్టాక్ సకాలంలో పంపిణీ చేయకుండా ఎఫ్ఆర్ఎస్ చేయమనడం సరైనది కాదన్నారు. రాజకీయ కక్ష్యతో హెల్పర్స్‌ను హోల్డ్‌లో పెట్టారని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. సమ్మె హామీలలో భాగంగా వేతనాలు పెంచలన్నారు. సుప్రీం తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని బిల్లులు,జీతాలు సకాలంలో ఇవ్వాలని చెప్పగా అన్ని రకాల సమస్యలు క్రమక్రమంగా పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ జిల్లా నాయకులు మధురవాణి, సిద్దమ్మ ఓబుళమ్మ పాల్గొన్నారు.

'పెద్దిరెడ్డి' అక్రమాలు బయటకు తీస్తాం : మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన అన్యాయాలు, అక్రమాలు త్వరలో బయటకు తీసి ఆయనపై కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల అరాచక పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల కాలంలోనే ప్రజలు సుఖసంతోషాలతో కాలం గడుపుతున్నారన్నారు. పెద్దిరెడ్డి ప్రజలనే మోసం చేసి వారి భూములను దోచుకు న్నారన్నారు. మీ భార్య, కుమారుడిపైన ఉన్న అక్రమాస్తులను త్వరలోనే బయటికి తీసి చర్యలు తీసుకుంటామన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు జగన్మోహన్ రాజు మాట్లాడుతూ పెద్దిరెడ్డి అడవులను రక్షించాల్సిన బాధ్యత ఉన్నటువంటి వేలాది ఎకరాల్లో భూకబ్జాలు చేసి మరో ఆంధ్ర వీరప్పన్ అవతారం ఎత్తారన్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయ చంద్రారెడ్డి, పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఉర్దూ కవి సమ్మేళనానికి కవులకు ఆహ్వానం

కవిసమ్మేళనాలకు ఎంపికైన కవులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తమిళనాడు రాష్ట్రంలోని తిరుపత్తూరులో ఫిబ్రవరి 2న తిరుపతిలో జరిగే అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనాలకు మదనపల్లె ఉర్దూ కవులు బాబా ఫక్రుద్దీన్, పఠాన్ మహమ్మద్ ఖాన్‌లకు ఆహ్వానం అందింది. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగే ఉర్దూ కవి సమ్మేళనాలకు ఆహ్వానం అందడం సంతోషంగా ఉందన్నారు. మహాప్రవక్త హాజరత్ మహమ్మద్ జీవితానికి సంబంధించి నాత్-ఎ-షరీఫ్ చదవడం జరుగుతుందన్నారు. ఉర్దూ భాషలో నిర్వహించే కవీ సమ్మేళనాలు మత సామరస్యం, జాతీయ సమైక్యతకు దోహదపడతాయన్నారు. తిరుపత్తూరులో జరిగే ఉర్దూ కవి సమ్మేళనంలో పఠాన్ మహమ్మద్ ఖాన్‌కు ఆషిఖ్-ఎ-రసూల్ అవార్డు ప్రదానం చేయనున్నట్లు కవి సమ్మేళన నిర్వాహకులు అన్వర్ ఖాదరి నుంచి లేఖ అందినట్టు వారు తెలిపారు. జాతీయ స్థాయి ఉర్దూ సదస్సుకు మదనపల్లి కవులను ఆహ్వానించడం పట్ల ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు,విద్యార్థులు వారిని అభినందించారు.

ఎసిబి వలలో రామసముద్రం ఎస్ఐ

ప్రజాశక్తి-రామసముద్రం : ఎస్ఐ వెంకట సుబ్బయ్య అవినీతి నిరోధక శాఖ అధికారులకు గురువారం చిక్కారు. ఏటవాకిలి సంబంధించి రోడ్డు ప్రమాదంలో ఓ లారీ యజమాని నుంచి రూ.లక్ష డిమాండ్ చేశాడు. లారీ యజమాని ఎసిబి అధికారులను ఆశ్రయించారు. పెట్రోల్ బంకులో రూ.70 వేలు నగదు తీసుకుంటూ ఎస్ఐ వెంకటసుబ్బయ్య రెడ్ హ్యాండెడ్‌గా తిరుపతి ఎసిబి డిఎస్‌పి జెస్సి ప్రశాంతి పట్టుకున్నారు. మండల చరిత్రలో ఒక ఎస్ఐని ఎసిబి అధికారులు పట్టుకోవడం తీవ్ర సంచలనంగా మారింది. ఎస్ఐని నెల్లూరు ఎసిబిబి కోర్టుకు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు.

కార్యకర్తకు అతికారి కృష్ణ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాంగర్‌కు చెందిన జనసేన కార్యకర్త వెంకట సాయి కుటుంబానికి రాజంపేట నియోజకవర్గ జనసేన నాయకులు అతికారి కృష్ణ రూ.10 వేలు తక్షణ సాయంగా ఆర్థిక సహాయం అందజేశారు. అతికారి సూచనలు మేరకు కె.ఎస్.నరసింహ, మన్నేరు లక్ష్మీనరసయ్య, అబ్బిగారి గోపాల్ గురువారం రాంనగర్‌లోని మృతుడి నివాసం వద్దకు వెళ్లి వారి కుటుంబ సభ్యులకు ఈ ఆర్థిక సాయం అందజేశారు. వారి కుటుంబానికి జనసేన అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జనసేన నాయకులకు వెంకటసాయి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విరాళం చెక్కు అందిస్తున్న వెంకటేష్ కుటుంబ సభ్యులు

లయన్స్ భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-పీలేరు: లయన్స్ క్లబ్ భవన నిర్మాణానికి శ్రీ వేంకటేశ్వర జ్యువెలర్స్ యజమాని శ్రీపురం వెంకటేష్, నాగమణి దంపతులు, కుమారుడు ప్రణీత్ రూ.లక్ష విరాళంగా అందజేశారు. గురువారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన లయన్స్ క్లబ్ కార్యక్రమంలో దాతలు తమ రూ.లక్ష విరాళం చెక్కును లయన్స్ క్లబ్ అధ్యక్షులు మహేష్ గుప్తకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ పట్టణంలో ఎన్నో ఏళ్లుగా వైద్య శిబిరాలు, కంటి శస్త్ర చికిత్స శిబిరాలు, పశు వైద్య శిబిరాలు, సంక్రాంతి సంబరాలు వంటి ఎన్నో సేవా కార్యక్రమాలతో చరిత్ర కలగిన క్లబ్‌కు సొంతభవనం చాలా అవసరమన్నారు. దాతలు ముందుకొచ్చి తమ ఇతోధిక సహాయ సహకారాలు అందివ్వాలని కోరారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మహేష్ గుప్త, చింతల విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్ ఇచ్చిన పిలుపు అందుకుని వెంటనే స్పందించి ప్రణీత్ రూ.లక్ష విరాళంగా అందించడం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో దాతలు మరింత మంది ముందుకొచ్చి లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల విస్తృతపరచడానికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మహేష్ గుప్త, కార్యదర్శి చింతల విజయ భాస్కర్‌రెడ్డి, కోశాధికారి చంగయ్య, పురం బుజ్జి పాల్గొన్నారు.

మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు : ఎంవిఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మానవ తప్పిదాల వల్లనే అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి.వినోద్ కుమార్ తెలిపారు. 36వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలులో కార్యక్రమంలో భాగంగా గురువారం ఎంవిఐ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్లు, వాహన చోదకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. తల్లిదండ్రులు చిన్న పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం వలన అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాహన చోదకులు ముఖ్యంగా యువత రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కలిగి మసలుకోవాలని సూచించారు. ప్రయాణికులు సురక్షితంగా తమ స్వస్థానాలకు చేరాలంటే డ్రైవర్లు ఆరోగ్యంగా ఉండాలని, ముఖ్యంగా దృష్టిలోపం లేకుండా చూసుకోవాలని అన్నారు. తరచూ నేత్ర పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ రాజంపేట ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించి డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. లయన్స్ క్లబ్ చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం శుభపరిణామమని, రోడ్డు ప్రమాదాల నివారణకు తమ సంస్థ సదా ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వై.సుబ్రహ్మణ్యం రాజు, సిహెచ్ నరసింహ, రీజనల్ చైర్మన్ ఎస్.వి.రమణ, జిల్లా చైర్మన్ టి.లక్ష్మీనారాయణ, చంద్ర నాయుడు, నరసింహ, పారామెడికల్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, కంటి వైద్యులు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** హెల్మెట్ ప్రయాణం సురక్షితమని మదనపల్లె డిఎస్‌పి కొండయ్య నాయుడు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మహోత్సవాల్లో భాగంగా స్థానిక మహిళ డిగ్రీ కళాశాల నుంచి మహిళల బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు కాపాడటం పోలీసుల బాధ్యతన్నారు. ప్రజలు కూడా సురక్షితమైన మార్గాల ద్వారా తమ ప్రయాణాలను సాగించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తున్నామన్నారు. హెల్మెట్ ధరించి వాహనం నడపడం వల్ల అనుకోని ప్రమాదాలు ఎదురైనప్పుడు ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చునన్నారు. ఫిబ్రవరి నెల నుంచి హెల్మెట్ ధరించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణ ప్రజలు గమనించి ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లి వన్ టౌన్, టూటౌన్, తాలూకా పోలీస్ స్టేషన్ల పరిధిలోని మహిళా కానిస్టేబుళ్లు, మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంవిఐ వినోద్ కుమార్

గీత కార్మికులకు రాయితీతో మద్యం షాపులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : కల్లుగీత కార్మికులకు 50 శాతం రాయితీతో మద్యం షాపులను కేటాయిస్తున్నట్లు మదనపల్లె ఎక్సైజ్ సిఐ భీమలింగ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లె ఎక్సైజ్ శాఖ పరిధిలో బి.కొత్తకోట, మదనపల్లె మున్సిపాలిటీ, రామసముద్రం, నిమ్మనపల్లి మండలాలలో ఒక్కో మద్యం షాపును గీత కార్మికులకు కేటాయించినట్లు తెలిపారు. దరఖాస్తు రుసుం రూ.2 లక్షలు చెల్లించి ఈడిగ, గౌడ సామాజిక వర్గాలకు చెందిన కార్మికులు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తు రుసుం తిరిగి రాదన్నారు. షాపులు దక్కించుకున్న గీత కార్మికులు ప్రతి సంవత్సరం చెల్లించే లైసెన్స్ ఫీజు నుండి 50 శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఈ సదవకాశాన్ని గీత కార్మికులు ఉపయోగించుకోవాలన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, 7వ తేదీ లాటరీ ద్వారా షాపులు కేటాయిస్తామని తెలియజేశారు.

వైద్య సేవలను తనిఖీ చేస్తున్న డాక్టర్ లోకవర్ధన్

వైద్య సేవలను సద్వినియోగం చేసుకుందాం

ప్రజాశక్తి-కలికిరి

ఎన్‌టిఆర్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకుందామని జిల్లా ఎన్‌టిఆర్ వైద్య సేవల కో-ఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ పేర్కొన్నారు. గురు వారం మండలం లోని మెడికుర్తి పిహెచ్‌సి పరిధిలోని కలికిరి-1 లోని షాది మహల్ పరిస రాలలో నిర్వహిస్తున్న 104 వైద్య సేవలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ప్రభుత్వం దీర్ఘకా లిక రోగులకు నెలకు సరిపడా మందులు 104 సేవలతో అందిస్తూ మినీ ప్రాథ మిక సంచార ఆరోగ్య కేంద్రంగా సేవలను అందించడానికి గాను అన్నిరకాల మందులు, ఇసిజి సౌకర్యం కూడా ఈ వాహనంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గర్భిణులు, అనుమానం గల గుండె సంబంధ జబ్బు గల వారికి కూడా ఇసిజి సేవలను ఉపయో గించుకోవచ్చని తెలిపారు. నిర్దేశిత చెక్లిస్ట్ ప్రకారం 105 రకాల మందులు, 14 రకాల పరీక్షలు ఉన్నాయని పేర్కొన్నారు. వాహ నం కండీ షన్‌లో ఉందా అనే విషయాలపై నివేదిక రాష్ట్రానికి పంపడం జరుగు తుందని అన్నారు. గళ్ళ పరీక్షలు కూడా నమూనాలు సేకరించడం, వీటి ద్వారా టిబి వ్యాధి నిర్ధారణ జరుగుతుంది అన్నారు. రానున్న రోజులలో ఈ వాహ నాలలో మరిన్ని వైద్య సేవలు రక్తపరీక్షలు, మూత్ర పరీక్షలు చేసే విధంగా ప్రణా ళికలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కావ్య గంధ, హెల్త్ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌వర్మ

ప్రజాశక్తి-కలికిరి



ఎమ్మెల్యే కిషోర్‌తో శ్రీనివాస్ వర్మ

ఆదివాసి ఎరుకల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కలికరికి చెందిన ఎస్‌టి నాయకుడు శ్రీనివాస్ వర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆదేశాల మేరకు ఆదివాసి ఎరుకల హక్కుల కొరకు, అనగారిన ఎరుకల హక్కుల సాధన కొరకు ఈ సేవా సంఘం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ సంఘా నికి తనను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందని, తనపై నమ్మకం ఉంచి సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎరుకల కులస్తుల అభివృద్ధికి, వారి సమస్యలు పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా నా వంతు కృషి చేస్తానని అన్నారు. ఉపాధ్యక్షులుగా ఎన్నికైన శ్రీనివాస్ వర్మ ఉపాధ్యక్షుడుగా ఎన్నికైనందుకు రాష్ట్రంలో అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు అభినందనలు తెలిపారు. శ్రీనివాస్ వర్మను ఎమ్మెల్యే నల్లరి కిషోర్ కుమార్ రెడ్డి అభినందించారు.

నేడు కలకడ మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కలకడ

మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలిపారు. ఉదయం 10.30గంటలకు నిర్వహించే ఈ సర్వసభ్య సమావేశం ఎంపిపి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గతంలో రెండు పర్యాయాలు కోరం లేక మండల సర్వసభ్య సమా వేశం వాయిదా పడిన విషయం పాఠకులకు తెలిసిందే. మండల సమావేశానికి అధికారులు ప్రగతి నివేదికలతో తప్పక హాజరు కావాలని సూచించారు.

పంచాయతీ డిఇకి వినతిపత్రం అందిస్తున్న మహిళలు

సిసి రోడ్డు నిర్మాణానికి వినతి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

స్థానిక పట్టణంలోని ఉంగరాలనగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మిం చాలని ఆ ప్రాంత మహిళలు పంచాయితీ ఇఇ డి.ప్రసాద్ రావుకు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మహిళలు ఇఇతో మాట్లాడుతూ ఉంగరాలనగర్‌లో రోడ్డుపై నీళ్ల ప్రవహిస్తూ ఇబ్బందికరంగా ఉందని ఈ అసౌకర్యాన్ని గుర్తించి సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయాలని వివరించారు. స్పందించిన ఇఇ ఒక నెలలోపు సిమెంటు రోడ్డు నిర్మాణం చేపడతామని వారికి హామీ ఇవ్వడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. పట్టణంలోని సిమెంటు రోడ్లు లేని అన్ని వీధులలో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కొబ్బరి చెట్లలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి-కలికిరి

కోకోనట్ క్లైంబర్ సహాయంతో చెట్టు ఎక్కుతున్న రైతు

ఏడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలో సమన్వయకర్త డాక్టర్ కె.మంజుల ఆధ్వర్యంలో కెవికె, వ్యవసాయ క్షేత్రంలో గల కొబ్బరి చెట్లను కోకోనట్ క్లైంబర్ ద్వారా ఎక్కడం రైతులు సాధన చేయించారు. మాస్టర్ శిక్షకులు కె.రఘు, కె.శ్రీను శిక్షణకు వచ్చిన ప్రతి యువకునికి సైకిల్ ద్వారా కొబ్బరి చెట్లు ఎక్కడం నేర్పించారు. ఉద్యానశాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు కొబ్బరిసాగు, కొబ్బరి రకాల గురించి వివరించారు .సేద్య విభాగం, శాస్త్రవేత్త సోమశేఖర్‌బాబు నేల ఎంపిక, భూసార పరీక్ష, ఎరువుల యాజమాన్యం పై విపులంగా వివరించారు. కొబ్బ రిలో ఆశించే వివిధ పురు గులు, తెగుళ్లను గుర్తించే విధానం, వాటి సమగ్ర నివారణ గురించి డాక్టర్ సస్య రక్షణ విభాగ శాస్త్రవేత్త వై. పీరు సాహెబ్ తెలి పారు. శిక్షకులు కొబ్బరి చెట్లను శుభ్రం చేస్తూ ఇసుక, ఉప్పు మిశ్ర మాన్ని మొవ్వుల నిండా నింపారు. శిక్షణకు వచ్చిన రైతులతో మొద టగా యోగ, వివిధ వ్యాయామాలు చేయించి ఆరోగ్య ప్రాముఖ్యతను తెలిపారు. కార్యక్రమంలో రైతులు, కెవికె సిబ్బంది పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

నా కక్షిదారుడైన వనల్లి మహమ్మద్ రఫీ, S/o వనల్లి సాబ్‌జాన్, డోర్‌నెం.94, 21 క్రాస్, గాయత్రి లేఅవుట్, బసవపుర మెయిన్‌రోడ్డు, ఐసిఐసిఐ ఎటిఎమ్ దగ్గర, కేఆర్‌పురం, బెంగళూరు నార్త్, కర్నాటక, మరియు సొంత స్థలం పీలేరు టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా.తేది: 22.01.2025, ఉదయం 11.00గం టలకు పీలేరులోని సబ్ రిజిష్టరు ఆఫీస్‌కు వెళ్తుండగా ఇంటి పత్రములు పోగొట్టుకున్నాడు.డాక్యుమెంట్ నెం.875/2012. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబర్‌కు తెలియజేయగలరు. అలాగే ఈ డాక్యుమెంట్స్ పై ఎవరికి ఎలాంటి అభ్యంతరాలున్నా తమను 7 రోజుల్లోగా సంప్రదించాలని. అలా ఎలాంటి ఫిర్యాదులు రానిపక్షంలో తాము ఎవరికీ, ఎలాంటి అభ్యంతరాలు లేవని భావించాల్సి ఉంటుంది.

యస్. మహమ్మద్ అలీ
అడ్వకేట్, పీలేరు-517214
సెల్: 9948194675

ఎస్‌సి, ఎస్‌టి నివాస ప్రాంతాల్లో మెరుగైన వసతులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మాట్లాడుతున్న ఎంపిడిఒ పరమేశ్వరరెడ్డి

ఎస్‌సి, ఎస్‌టి నివాస ప్రాంతాలలో మెరుగైన వసతులను ఏర్పా టు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాచవేటివారిపల్లి పంచాయతీ దిగువ మాచిరెడ్డిగారిపల్లిలోని గుడ్లవారిపల్లెలో నిర్వహించిన పౌర హక్కుల పరిరక్షణ సమావేశానికి రీసర్వే డిటి సిరాజుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, ఎపిఎం రమేష్, ఆర్డబ్ల్యుసి ఎ.మిథున్‌చక్రవర్తి, ఎంపిటిసి రెడ్డి వెంకటేష్, రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జె.వె ంకటేష్, ఎస్‌టి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ నాయకులు మునిరత్నం, మాల మహానాడు మండలాధ్యక్షులు వీరనాల మాణిక్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలో ప్రతి నెల 30న ఎస్‌సి, ఎస్‌టి నివాస ప్రాంతాలలో తహశీల్దార్, ఎంపిడిఒ అధ్యక్షతన మండల అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సివిల్ రైట్స్ డే సమా వేశాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి నివసించే ప్రాంతంలో తాగునీరు, మురుగునీటి కాలువలు, సిసి రోడ్లు, విద్యుత్ సదుపాయాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి విద్యావంతుల అవ్వాలని, ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. మండ లంలో ఇప్పటికే రూ.1.5కోట్ల నిధులతో సిసి రోడ్డు పనులు జరుగు తున్నాయని అన్నారు. ఆర్.జె.వెంకటేష్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభు త్వం గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఎస్‌సి, ఎస్‌టి ప్రాంతాలలో అనేక అభివృద్ధి పనులను చేపట్టిందని, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపా లనలో కూటమి ప్రభుత్వం కూడా విరివిగా అభివృద్ధి చేయడానికి ఇప్పటికే పనులను ప్రారంభించిందన్నారు. మునిరత్నం మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిల నుంచి వచ్చే వినతులను పరిశీలించి, వాటికి పరిష్కారం మార్గాలను చూపిన తర్వాతే మరోచోట సమావేశాలను జరపాలని అన్నారు. సమస్యలకు పరిష్కారం దొరకకపోతే సమావేశాలు నిర్వహించి లాభం లేదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారెప్ప, విఆర్‌ఒ సనత్‌కుమార్‌రెడ్డి, ఎఎస్‌ఐ జిలానిబాషా, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పీలేరు : కుష్టు వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

గాంధీజీ కలలుగన్న కుష్టు రహిత సమాజ నిర్మాణానికి సమిష్టిగా కృషి చేద్దామని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి, సర్పంచ్ కొండయ్య నాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. కుష్టువ్యాధి వ్యతిరేక దినోత్సం సందర్భంగా మండలంలోని మేళ్లచెరువు పంచాయితీ, చీపాటివారిపల్లిలో సర్పంచ్ కొండయ్య నాయుడు అధ్యక్షతన కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తలుపుల పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ మైక్రోబాక్టీరియం లెప్రే అనే బాక్టీరియా వల్ల చర్మం, నరాలకు ఈ వ్యాధి సోకుతుందని అన్నారు. గాంధీజీ కుష్టు వ్యాధి అంటురోగం కాదన్న సందేశాన్ని ప్రజలకు ఇస్తూ రోగుల గాయాలను శుభ్రం చేశారని గుర్తు చేశారు. మహాత్మా గాంధీ చూపిన ప్రేమ, సేవ ఎనలేనిదని అందుకే ప్రతి సం వత్సరం జనవరి 30న కుష్టు వ్యతిరేక దినోత్సవంగా జరుపుకుంటామని తెలి పారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకే టర్ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణ య్య, ఎఎన్ఎం రత్నం, సిహెచ్ఒ కుముద, సుధా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కలికిరి : మండలం లోని మహల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు డాక్టర్ చిన్న రెడ్డెప్ప ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి విద్యార్థులు కు కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. కుష్టువ్యాధి గ్రస్థుల పట్ల వివక్షత చూప రాదనీ, వారి పట్ల సానుభూతి, దయ కలిగివుండాలని తెలిపారు. కుష్టువ్యాధి ఒక బాక్టీరియా వల్ల వస్తుందని అంతేకాని గత జన్మ పాపం వల్ల కానీ దేవుని శాపం వల్ల కానీ రాదని అన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులకు కూడా గాంధీజీ సేవ చేశారని, 30న మహాత్మ గాంధీ వర్ధంతిని జాతీయ కుష్టువ్యాధి వ్యతిరేక దినో త్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. ఈసందర్భముగా హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ కుష్టు వ్యాధి శరీరం పైన స్పర్శ లేని మచ్చలు, రాగి రంగులో ఉండి మిన, మిన మని మెరుస్తూ ఉంటాయాని అన్నారు. ఈ మచ్చలు ఉన్న ప్రదేశం లో నొప్పి, నవ్వ ఉండదని, చమట పట్టదని, వెంట్రుకలు కూడా మొలచవని అన్నారు. ఈ మచ్చలు శరీరం పైన ఎక్కడైనా రావచ్చు అన్నారు. తొలిదశలో ఈ రకపు మచ్చలను గుర్తించి చికిత్స తీసుకుంటే అంగవైకల్యం రాకుండా చేయవచ్చునని తెలిపారు. ఆరు నెలలు మందులు తింటే వ్యాధి పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. ఈ వ్యాధికి పరీక్షలు, మందులు పూర్తిగా ఉచితంగా ప్రభుత్వం ఇస్తుందన్నారు. అనంతరం నినా దాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి ప్రమాణం చేయించారు. కార్యక్రమము లో టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి నాగవేణి, ఎఎన్ఎం చంద్రకళ, ఆశా కార్యకర్తలు, హెచ్ఎం చెంగల్‌రాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపేట ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్‌లో తొలగించిన పదిమంది ఉద్యోగస్తులను కాంట్రాక్టర్ మహేష్‌నాయుడు వెంటనే విధుల్లోకి తీసుకోవాలని రైల్వే కోడూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి గోసాలదేవి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్‌సి సెల్ కన్వీనర్ ఎన్.శాంతయ్య గురువారం రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపారు. ఎపిఎండిసి సంస్థను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి ఎంపిఎండిసి పబ్లిక్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను కాంట్రాక్టర్ ఎటువంటి నోటీసు ఇవ్వకుండా తొలగించడం దుర్మార్గమైన చర్యని అన్నారు. కుటుంబ పోషణ కోసం వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనిఅన్నారు. తొలగించిన ఉద్యోగస్తులకు న్యాయం జరిగేంతవరకు కాంగ్రెస్ పార్టీ తరపున పోరాడుతామని అవసరమైతే రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకుడు నన్నం శివకృష్ణ, పుల్లంపేట అధ్యక్షుడు సిగమాలరవి, సురేష్, ఉప్పుటూరి బ్రహ్మ, మహిళా నాయకురాలు ఉప్పుటూరు ఆదిలక్ష్మి, అజిత కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-వీరబల్లి

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపిడిఒనూర్జహాన్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై 19వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిడబ్ల్యూఎంఎ పీడీ వెంకటరత్నం, ఎపీడీ నంద కుమార్‌రెడ అధికారికంగా వ్యవహరించారు. 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని 12 గ్రామ పంచాయతీలో చేపట్టిన వివిధ పనులపై నివేదికలను చదివి వినిపించారు. మొత్తం రూ. పదికోట్ల 53 లక్షల 85 వేల 849 కోట్లు ఖర్చు చేయగా కూలీలకు వేత నాలుగా రూ. ఏడు కోట్ల 22 లక్షల 92 వేల 892 కోట్లు, రూ. మూడు కోట్ల 30 లక్షల 92 వేల 957 కోట్లు సామగ్రి చెల్లింపులు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ పనులపై తనిఖీ నిర్వహించగా ఉపాధి హామీ సిబ్బంది పని ప్రదేశంలో కూలీల మస్టర్లు, హౌసింగ్, పై పని ప్రదేశం తేడాలు వంటి తప్పిదాల పై మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు గాను రూ.97,360లు రికవరీ ఆదేశించినట్లు, రూ.3 లక్షలకు ఎంక్వేరి చేయమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పి మురద్, ఎపిఒనాగరాజ్, హౌసింగ్ హౌసింగ్ ఎఇ వెంకటేష్, ఇసి ఆంజనేయులు, సర్పంచులు గోపీనాథ్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు వరప్రసాద్, చంద్రుడు, శ్రీపద్మజ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఎటువంటి అవఛనీయ సంఘటనలు జరగ కుండా ఎస్‌ఐ మోహన్ నాయక్, పోలీస్ సిబ్బంది, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఉపాధిహామీ సిబ్బంది, పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

రాయచోటి, సుండుపల్లి, రాయవరం పింఛా వరకు డబుల్ రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని ఎపి బంజారా సంఘం జాతీయ అధ్యక్షులు నాగేంద్ర నాయక్ చౌహాన్ పేర్కొన్నారు. గురువారం తహశీల్దార్ దైవాదీనంను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయి దాదాపు పది సంవత్సరాలు అవుతుందని, వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సుండు పల్లి ప్రాంతానికి చెందిన ఎంతో మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డబుల్ రోడ్డు పనులు చేపట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఏపి బంజారా సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సేవలా నాయక్ , గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నాగన్న, ఏపి బంజారా సంఘం సుండు పల్లి అద్యక్షుడు రాజా శేఖర్ నాయక్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

అంతర పంటలపై మొగ్గుచూపాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

ఏకపంట విధానం వద్దని అంతర పంటల విధానం వలన భూమి సారవంతమై మొక్కలు కావలసిన పోషకాలు అందడమే కాకుండా రసాయనక పురుగుమందులకు వాడే ఖర్చులు తగ్గించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ వీరనాగయ్య పేర్కొన్నారు. గురువారం టి.సుండుపల్లి గ్రామంలో మాజీ ఎంపిపి అజంతమ్మ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విధానంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవచ్చని తెలిపారు. రైతుకు ఖర్చులు తగ్గి ఆదాయం పొందవచ్చునని చెప్పారు. అంతర పంటలకు పంటలుగా ఆకుకూరలు, ముల్లంగి, క్యారెట్, బీట్రూట్, చుక్కాకు, కొత్తిమీర, గోంగూర, ఆకుకూరలు సాగు చేయడం వలన ప్రధాన పంటలకు అయ్యే ఖర్చు తగ్గుతుందని తెలిపారు.

వైసిపి వాణిజ్య విభాగ అధ్యక్షులుగా నూర్ మొహిద్దీన్‌ఖాన్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

వైసిపి మదనపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామక జాబితాను వైసిపి అధ్యక్షులు వై.ఎస్.జగన్ ఆదేశాల మేరకు బుధవారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. మదనపల్లి అసెంబ్లీ నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులుగా నిమ్మనపల్లి మండలానికి చెందిన ఎం.నూర్ మొహిద్దిన్ ఖాన్‌ను నియమించింది. ఈ సందర్భంగా నూర్ మొహిద్దాన్ ఖాన్ మాట్లాడుతూ మదనపల్లి నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులుగా తనపై నమ్మకంతో తనను నియమించడం సంతోషంగా ఉందన్నారు. సందర్భంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, మదనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిస్సార్ అహ్మద్ కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఇఒకు ఘన సన్మానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తన ప్రతిభ, పట్టుదల, దార్శనికతతో పనిచేస్తూ మండల విద్యాశాఖకు వన్నెతెచ్చిన రెడ్డిశేఖర్ అభినందనీయులని వక్తలు కొనియాడారు. రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలో ఉత్తమ ఎంఇఒగా ఎంపికయిన ఎంఇఒ ఆర్.రెడ్డి శేఖర్‌ని ఉపాధ్యాయులు సంఘ నాయకులు గురువారం ఎంఆర్‌సిలో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఎస్‌టియు మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాలు మేరకు నిరంతరం మండల విద్యాభివృద్ధికి కృషి చేసిన వారికి ప్రశంసలు రావడం అభినందనీ యమన్నారు. కార్యక్రమంలో మరో ఎంఇఒ భీమాచారి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు సోమ శేఖర్, ఖాదర్‌వల్లి, రమణ, విశ్వనాథరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి రెడ్డెప్ప, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని నీలావాండ్లపల్లికు చెందిన జనసేన కార్యకర్త జోకారెడ్డిబాబు నాన్ హీలింగ్ అల్సర్ ఆపరేషన్‌తో పది సంవత్సరాల నుంచి నరాల సమస్యతో బాధ పడుతున్నాడు. సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న రాజంపేట జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి దినేష్ గురువారం నీలావాండ్లపల్లికి వెళ్లి జోకా రెడ్డికి వైద్య ఖర్చులకోసం తన సొంతంగా రూ.20 వేలు నగదును అందించారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి మంచి వైద్యం అందేలా చూస్తామని భరోసానిచ్చారు.

గాంధీజీ అడుగుజాడల్లో నడుద్దాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నివాళి అర్పిస్తున్న టిడిపి నాయకులు

చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ముత్తు ఆంగ్ల మాధ్యమా పాఠశాలలో సంస్థ వ్యవస్థాపక అధ్య క్షులు ఎంపీ ఆనందన్, కోశాధికారి పట్నం గిరిజమ్మాల్, వ్యవస్థాపక జనరల్ సెక్రటరీ ఎ.కవితా రాణి, పాఠశాల ఉపాధ్యా యులు, ఆనంద వృద్ధాశ్ర మంలోని వృద్ధులు మరియు చిన్నారులు మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విజయభారతి విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.సేతు మనవరాలు నిహిరా జన్మదినం సంద ర్భంగా ఉదయం అల్పాహార అన్నదాన వితరణతో పాటు కేక్ కట్ చేసి సంతోషాన్ని పిల్లలతో పంచుకున్నారు. కార్యక్రమంలో సేతు కుమార్తె విజయభారతి వైస్ ప్రిన్సిపల్ నిక్షిత పాల్గొన్నారు. రమేష్ నాయుడు, హస్మిద్ నాయుడు జన్మదినం సందర్భంగా చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థకు 100 కేజీల బియ్యాన్ని వితరణ చేశారు. వివేకానంద ఆశయం ఫౌండేషన్ బెంగళూరు వారు అనేక సేవా కార్యక్రమాలు చేసి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు సంపాదించుకున్న ఓం కుమార్ కుమార్తె పరిణిక మొదటి జన్మదిన వేడుకలు చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో పిల్లల వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి పిల్లలకి అన్నదాన వితరణ చేసి వారి సంతోషాన్ని పంచుకున్నారు.

టిడిపి ఆధ్వర్యంలో..

జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాల మేరకు పనిచేద్దామని మదనపల్లె తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు. స్థానిక బెంగళూరు బస్టాండ్ దగ్గర టిడిపి కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశం మొత్తాన్ని ఎక తాటిపైకి తెచ్చిన మహనీయుడు బాపూజీ అన్నారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, నాయకులు బాలుస్వామి, షంషీర్, నాదెళ్ల శివన్న, కలకడ వేణు గోపాల్, పూలకుంట్ల హరిబాబు, బాలుపాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

విద్యార్థుల రక్తదానం హర్షణీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యార్థులు రక్తదానం చేయడం హర్షణీయమని ప్రభుత్వ విప్ అరవశ్రీధర్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం ఎంతో గొప్పదని రక్తదానానికి ముందుకు వచ్చిన విద్యార్థులను అభినందిం చారు. తల్లిదండ్రులు వారి పిల్లలను సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించేలా తీర్చిదిద్దాలని అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు, గురువుల పట్ల మర్యా దపూర్వకంగా నడుచుకోవాలన్నారు.కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీని వాసులు, తాతంశెట్టి నాగేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువుల పెంపకంపై కరపత్రాలను అందిస్తున్న డాక్టర్ సురేష్

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి : డిడి

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని దిగువగొట్టి వీడు గ్రామంలో గురువారం మండల పశువైద్యాధికారి డాక్టర్ గణేష్ నిర్వహించిన పశు వైద్య శిబిరం నందు పశువులకు, దూడలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులు తాగించారు. ఈ నట్టల నివారణ మందును గొట్టువీడు ప్రజలు జంగంపల్లి ప్రజలు ఉపయోగించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని రాయచోటి ఉపసంచాల కులు డాక్టర్ మాలకొండయ్య ప్రాంతీయ పశు వైద్యశాల సంబేపల్లి డాక్టర్ శ్రీధర్ రెడ్డి లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశు వైద్య శిబిరాల ఆవశ్యకతను మరియు గడ్డి పెంపకం, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 10 సెంట్లు నుంచి 50 సెంట్లు భూమి వరకు గడ్డి పెంచుకోవచ్చని తెలిపారు. పశు పక్షోత్సవాలు, పశుగణన, గూర్చి నోడల్ అధికారి సహాయ సంచాలకులు డాక్టర్ లోకేష్ తెలియజేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సిద్ధార్థ బాబు,హేమలత నాగరాజ, సచిన్ నాయక్, భార్గవి, సుమలత, రామమోహన్, రైతులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** పశువుల పెంపకం పై పాడి రైతులకు పశు ఆరోగ్య శిబిరం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ సురేష్ తెలిపారు.ముష్టూరు, కొండయ్యగారిపల్లె గ్రామాలలో స్థానిక పశు సంవర్ధక శాఖ సహాయకులతో కలిసి పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు, గొర్రెలు, మేకలు, నాటు కోళ్ల పెంపకం పై పశు ఆరోగ్య శిబిరం ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తూ, వాటికి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అధిక పాల దిగుబడికి పచ్చి గడ్డితో పాటు, పోషకాలు కలిగిన దాణాను పశువులకు అందించాలన్నారు. పశు ఆరోగ్య శిబిరం ద్వారా పశువులకు, దూడలకు, గొర్రెలకు, మేకలకు ముందస్తు నట్ట నివారణ మందులను వేశామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయకులు మునీంద్ర, హరి, శిరీష, పాడి రైతులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-వీరబల్లి : మండల కేంద్రం వీరబల్లిలోఇన స్థానిక షిర్డీ సాయి బాబా మందిరంలో గడికోటకు చెందిన తంగేటి ప్రసాద్, గంగాదేవి ఆర్థిక సాయంతో ప్రజలకు అన్నదానం చేశారు.అన్న దాతలు కువైట్‌లో ఆర్థిక సాయం పంపించారని ఆలయ పూజారి రంగ స్వామి తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి, మల్లికార్జున, మల్లేష్, నాగమల్‌రెడ్డి, హరి,శ ంకరయ్య, దండూరి సుబ్బారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు సుబ్బ లక్షుమమ్మ, అంజనమ్మ,లక్ష్మీదేవి, కళావతి, ప్రభావతి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

ప్రజాశక్తి-ములకలచెరువు : వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడకుండా ముందు సూచనలు తీసుకోవాలని తంబళ్లపల్లి టిడిపి ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో జడ్‌పి సిఇఒ రవికుమార్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి సమస్య తలెత్తకుండా నీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నిధులు కేటాయించిందని అన్నారు. గ్రామాల్లో నీటి కొరత , నీటి సమస్యలపై దృష్టిసారించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ హరినారాయణ, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కె.వి.రమణ, ఎక్స్ సర్పంచ్ ఎర్రగుడి సురేష్, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం కోసం గాలింపు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని తూముకుంట సోలార్‌లో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన దీరజ్, కేసరికేసరి(25) అనే ఇద్దరు యువకులు బుధవారం గండిమడుగులో నీటిలో పడిపోయారు.దీరజ్ బయటకు రాగా కేసరి కనిపించలేదు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీరాములు, విఆర్‌ఎ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. గజ ఈత గాళ్లతో మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం సాయంత్రం వరకు వెతికినా మృతదేహం కనిపించలేదు. సంఘట స్థలాన్ని తహశీల్దార్ భాగ్యలత, విఆర్‌ఒలు అల్లా బకాష్, శేఖర్, విఆర్‌ఎలు పీరుల్లా, నారాయణ, గండిమడుగు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు పర్యవేక్షిస్తున్నారు.

బాస్ వాలీబాల్ టోర్నమెంట్ విజేత గాలివీడు జట్టు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రంలో మూడు రోజులపాటు నిర్వహించిన వాలీబాల్ బాస్ టోర్నమెంట్ విజేతగా గాలివీడు మండలం జట్టు నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో రాయచోటి నియోజకవర్గంలో 12 జట్లు పాల్గొన్నాయి. గాలివీడు జట్టు విన్నర్ నిలవగా లక్కిరెడ్డిపల్లి మండల జట్టు రన్నర్స్‌గా నిలి చింది. దిన్నెపాడు గ్రామం జట్టు మూడవ స్థానంలో నిలిచాయి. ఈ టోర్న మెంట్లో మొదటి స్థానంలో నిలిచిన గాలివీడు జట్టుకు రూ.25 వేల రూపా యలు ద్వితీస్థానంలో నిలిచిన లక్కిరెడ్డిపల్లి జట్టుకు రూ.15వేలు, రూపాయలు తృతీయ స్థానంలో నిలిచిన దిన్నపాడు జట్టుకు రూ.7500లు నగదు బహుమతిని బహుమతులు మండల టిడిపి నాయకులు షేక్ అరీఫుల్లా, ఎస్‌ఐ రవీంద్ర బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అరీఫుల్లా మాట్లాడుతూ టోర్నమెంట్‌లో పాల్గొని విజయం సాధించలేని జట్లు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలని భవిష్యత్తులో మెరుగైన విజయాలు సాధిం చాలని ఆకాంక్షించారు .కార్యక్రమంలో జెకె జయచంద్రారెడ్డి, నసిరుద్దీన్ పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన గాలివీడు జట్టుకు ట్రోఫీ అందిస్తున్న టిడిపి నాయకులు షేక్ అరీఫుల్లా, ఎస్‌ఐ రవీంద్ర